

మేం ఓటు వేసేది లేదు...

తమ గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించేంత వరకు ఓటేసేది లేదని పలుచోట్ల ప్రజలు ఆందోళన చేయగా అధికారులు నచ్చజెప్పారు. 8లో



50 ఏళ్ల వయస్సులో తొలిసారి

న్యూడెమోక్రసీ దళ సభ్యుడిగా, కమాండర్‌గా పనిచేసి 35 ఏళ్లపాటు అజ్ఞాత జీవితం గడిపిన ఆవునూరి మధు తొలిసారి ఓటు వేశారు. 8లో

గరిష్టం / కనిష్టం

37° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని చోట్ల ఆకాశం మేఘావృతమై, రాత్రి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

సీబీఎస్‌ఈ ఫలితాల్లో 'ఏకలవ్య' ప్రతిభ

ములకలపల్లి: సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) 100 శాతం ఫలితాలు సాధించింది. పాఠశాలలో 41 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఏకలవ్య పాఠశాలకు మూకమామిడి ప్రాజెక్ట్ సమీపంలో పక్కా భవనాలు నిర్మిస్తుండగా, మండల పరిధిలో సరిపడా ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో, దమ్మపేట మండలం అంకంపాలెంలో తాత్కాలికంగా పాఠశాల నిర్వహిస్తున్న విషయం విదితమే. కాగా, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజేశ్ అభినందించారు.

దమ్మపేటలో..

దమ్మపేట : మండలంలోని గండుగులపల్లి గ్రామంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో సోమవారం ప్రకటించిన సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ పాఠశాలలో 58 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులు కావడం విశేషం.

టేకులపల్లిలోనూ 100 శాతం..

టేకులపల్లి: సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ భద్రయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 57 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారని, మొదటి బ్యాచ్‌లోనే 100 శాతం ఫలితాలు రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

ఖమ్మంలో కంట్రోల్ రూమ్

- పర్యవేక్షించిన ఆర్ఓ, అబ్జర్వర్లు



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పోలింగ్‌ను కలెక్టరేట్ నుంచి అధికారులు పర్యవేక్షించారు. నియోజకవర్గానికి సంబంధించి ఏడు అసెంబ్లీ స్థానాల పరిధిలో 1,896 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు అన్నిచోట్ల సీసీ కెమెరాలు అమర్చారు. వీటి ఫుటేజీని కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. ఇక్కడి నుంచి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, పోలీస్ పరిశీలకులు చరణ్‌జిత్ సింగ్, వ్యయ పరిశీలకులు అరుణ్‌ప్రసాత్ కృష్ణసామి కేంద్రాల్లో పోలింగ్ తీరును పర్యవేక్షిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.

కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ అభివృద్ధి శాఖ ద్వారా ఎంపిక చేసిన కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఈ ఏడాది మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసి, 7జీపీఏ కంటే ఎక్కువ సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, దివ్యాంగుల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ మేరకు అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈనెల 15 నుండి 30వ తేదీ లోపు www. telanganaepass. cgg. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఎయిడెడ్, ఆశ్రమ, ప్రభుత్వ వసతిగృహాలు, కేజీబీవీ పాఠశాలలు, ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, నవోదయ, ఆదర్శ పాఠశాలలు, కేంద్రియ విద్యాలయాలలో పదో తరగతి చదివి ఉత్తీర్ణులు అయిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.





ఇల్లెందు మండలం పోలారంలో బారులుదీరిన ఓటర్లు

పోరు ముగిసింది..



ఓటుహక్కు వినియోగించుకున్న దివ్యాంగుడు

జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్

- 67.29 శాతం నమోదు
- అత్యధికంగా అశ్వారావుపేట నియోజకవర్గంలో..
- నెమ్మదిగా మొదలై.. ఆ తర్వాత జోరందుకున్న వైనం
- కొన్నిచోట్ల ఈవీఎంల మొరాయింపు.. ఓటేసేది లేదన్న పల్లెజనం



ఓటు వేసిన కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 67.29 శాతం పోలింగ్ నమోదైంది. ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఉదయం ఏడు గంటల నుంచే ప్రజలు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అప్పటి నుంచి సాయంత్రం వరకు పోలింగ్ జరిగింది. జిల్లా, రాష్ట్ర సరిహద్దులో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య ఉద్రికత్తలు నెలకొన్నప్పటికీ జిల్లాలో శాంతిభద్రతల పరంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు.

హడావుడి లేకుండా

జిల్లా వ్యాప్తంగా ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రక్రియ మొదలైంది. తొలి రెండు గంటలు ఓటర్లు తక్కువగానే రావడంతో 9 గంటల వరకు 11.53 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఆ తర్వాత క్రమంగా ఓటర్ల సంఖ్య పెరిగింది. ఉదయం వేళ ఊహించిన స్థాయిలో ఎండలు లేకపోవడంతో ప్రజలు బారులుదీరారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్ కేంద్రాలు ఓటర్లతో కిటకిటలాడాయి. ఈ నాలుగు గంటల వ్యవధిలోనే 37.78 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో మధ్యాహ్నం ఒంటిగంట వరకే 49.31 శాతం మేర పోలింగ్ నమోదైంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే ఈసారి కూడా భారీగా ఓటింగ్ నమోదు అవుతుందని అందరూ అంచనా వేశారు. కానీ ఆ తర్వాత ఓటింగ్ ప్రక్రియలో ఆశించిన వేగం కనిపించలేదు. చివరకు 67.29 శాతానికే పరిమితమైంది.



పోలింగ్‌లో విషాదం..

అశ్వారావుపేట మండలం నెహ్రూనగర్ పోలింగ్ బూత్‌లో ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ సీనియర్ అసిస్టెంట్ పోలూరి శ్రీకృష్ణ గుండెపోటుతో మరణించారు. ఆయన విధుల్లో ఉండగానే అస్వస్థతకు గురికావడంతో పక్కనే ఉన్న సీహెచ్‌సీకి వెళ్లారు. కాసేపటికే ప్రాణాలు విడిచారు. అశ్వారావుపేట మండలం వేదాంతపురం గ్రామానికి చెందిన కాశీ నాగేశ్వరరావు (58) అనే వ్యక్తి ఓటు వేసేందుకు ఇంటి నుంచి బయలుదేరి ఆటో కోసం వేచి చూస్తుండగానే అస్వస్థతకు గురై మరణించాడు. ఇల్లెందు పట్టణం జేబీఎస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఓ వృద్ధుడు తేనెటీగల దాడికి గురవగా ఆస్పత్రికి తరలించారు. ఇక స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి, గుండాల, ఇల్లెందు మండలాల్లో ఎన్నికల బహిష్కరణకు పలు గ్రామాల ప్రజలు పిలుపునిచ్చారు. అయి తే అధికారులు సర్దిచెప్పడంతో తిరిగి ఓటుహక్కు వినియోగించుకునేందు కు సంసిద్ధత వ్యక్తం చేశారు. మరోవైపు ఉద యం పోలింగ్ మొదలైన వెంటనే పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట, చర్ల, జూలూరుపాడు మండలాల్లో అక్కడక్కడ ఈవీఎంలు మొరాయించినా, కొద్దిసేపటికే అధికారులు లోపాలను సవరించి ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు.

రెండు నెలలుగా అధికారుల బిజీ బిజీ..

పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ గత రెండు నెలలుగా కొనసాగుతోంది. గత మార్చి 15న ఎన్నికల కోడ్ జారీ కావడంతో ఆ రోజు నుంచే జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో అధికారులు ఎన్నికల ప్రక్రియలో తలమునకలయ్యారు. ఆ తర్వాత ఏప్రిల్ 17న నోటిఫికేషన్ జారీ అయింది. దీంతో నామినేషన్లు, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు వంటి కార్యక్రమాలతో అధికారులు బిజీగా గడిపారు. మరోవైపు ఎన్నికల ప్రచారాన్ని రాజకీయ పార్టీలో హోరెత్తించాయి. ఇలా మార్చి 15న మొదలైన ఎన్నికల హడావుడి మే 13 సాయంత్రంతో పూర్తయింది. పోలింగ్ ముగిసిన వెంటనే అశ్వారావుపేట, కొత్తగూడెం నియోజకవర్గాల ఈవీఎంలు ఖమ్మంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌కు, మిగిలిన నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను మహబూబాబాద్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఈ ఎన్నికల్లో ప్రజాతీర్పు ఏంటనేది జూన్ 4న తేలనుంది.

67.29 శాతం పోలింగ్..

జిల్లాలోని ఇల్లెందు, భద్రాచలం, పినపాక నియోజకవర్గాలు మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలు ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. ఖమ్మం పరిధిలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి 67.93 శాతం పోలింగ్ నమోదు కాగా, మహబూబాబాద్ పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 66.83 శాతం నమోదైంది. మొత్తం జిల్లా వ్యాప్తంగా 67.29 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో అత్యధికంగా అశ్వారావుపేట నియోజవర్గ పరిధిలో 76.67 శాతం, అత్యల్పంగా కొత్తగూడెంలో 62.31 శాతం పోలింగ్ నమోదైంది.

నియోజకవర్గం	పోలింగ్ శాతం
కొత్తగూడెం	62.31
అశ్వారావుపేట	76.67
పినపాక	66.00
ఇల్లెందు	70.55
భద్రాచలం	64.72



చర్ల మండలం తిప్పాపురంలో ఓటు వేసేందుకు కాలినడకన వస్తున్న రాళ్లాపురం ఆదివాసీ మహిళలు



దుమ్ముగూడెం మండలం గౌరారం పోలింగ్ బూత్ వద్ద పహారా కాస్తున్న పోలీసులు



ఉంజుపల్లి పోలింగ్ కేంద్రం నుంచి ఈవీఎం, పోలింగ్ సామగ్రిని తీసుకొస్తున్న సిబ్బంది

పోలింగ్ కేంద్రాల సందర్శన

వెబ్‌కాస్టింగ్ ద్వారా ఓటింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం)/పాల్వంచ/పాల్వంచరూరల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల పలు పోలింగ్ కేంద్రాలను సోమవారం సందర్శించారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ మహిళా పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఆ తర్వాత సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని, జగన్నాథపురంలో పోలింగ్ స్టేషన్‌ను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించవద్దని సిబ్బందికి సూచించారు. అనంతరం పాల్వంచలోని సిల్ క్యాంపస్ పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన స్వీప్ సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగారు. అనంతరం పాల్వంచ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విద్యాచందన తదితరులు ఉన్నారు.



సింగరేణి మహిళా కళాశాల మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు, సిబ్బందితో కలెక్టర్ ప్రియాంక ఆల

ఎన్నికల ప్రక్రియపై హర్షం..

జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల హర్షం వ్యక్తం చేశారు. సుమారు రెండు నెలల పాటు పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో జిల్లా ప్రజల సహాయ సహకారాలు, భాగస్వామ్యం మరువలేనివని పేర్కొన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

ఓటువేసిన కలెక్టర్..

పాల్వంచ ఎన్ఎండీసీ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని పాఠశాల పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. కాగా మణుగూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐటీడీఏ పీఓ, పినపాక నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓటేసిన నాలుగు తరాలు !

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని భద్రాచలంలో ఒకే కుటుంబానికి చెందిన నాలుగు తరాల వారు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణానికి చెందిన ఎంబీ నర్సారెడ్డి, అతడి తల్లి కాశమ్మ, నర్సారెడ్డి కుమారుడు నరసింహారెడ్డి, మనవడు విష్ణువర్ధన్ రెడ్డి ఓటు వేశారు.

– భద్రాచలంఅర్బన్



ఓటు వేశాక నర్సారెడ్డి కుటుంబీకులు

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి వారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



బేడా మండపంలో దీక్ష విరమణలో పాల్గొన్న మాలధారులు

వైభవంగా రామదీక్ష విరమణ..

శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో శ్రీరామ దీక్ష విరమణ వైభవంగా జరిగింది. తొలుత భద్రుని గుడిలో శ్రీరామ పాదుకలకు అర్చకులు పూజలు చేశారు. పాదుకలను ఆలయ అధికారులు శిరస్సుపై ధరించి మేళతాళాలు, అర్చకుల మంత్రోచ్ఛరణలు, భక్తుల జయ జయ ధ్వానాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం మాలధారులు ఇరుముడులు సమర్పించగా ఆలయ ప్రధాన అర్చకులు విజయరాఘవన్ దీక్ష విరమణ గావించారు. అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎన్నికల ఆంక్షల నేపథ్యంలో ఉదయం ప్రదక్షిణ, సాయంత్రం స్వామి వారికి వెండిరథ సేవ ఆలయంలోనే జరిపారు. కాగా, మంగళవారం పుష్యమి నక్షత్రం సందర్భంగా ఆలయంలో శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించనున్నారు.

2,500 మందితో బందోబస్తు

- ఎస్పీ రోహిత్‌రాజ్ వెల్లడి
- పలు పోలింగ్ కేంద్రాల పరిశీలన



నాగినేనిప్రోలులో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్/బూర్గంపాడు : జిల్లాలో 2,500 పోలీస్ సిబ్బందితో ఎన్నికల బందోబస్తు విధులు నిర్వహించామని ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. మొత్తం 1,105 కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని చెప్పారు. జిల్లా కేంద్రంలోని సింగరేణి పాఠశాల, సెయింట్ మేరీస్ స్కూల్, రామచంద్ర డిగ్రీ కళాశాల, పాల్వంచ గట్టాయిగూడెం, ఆంజనాపురం, బూర్గంపాడు మండలంలోని మోరంపల్లి బంజర, నాగినేనిప్రోలు, రెడ్డిపాలెం పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఓటు వేసిన ఎస్పీ..

కొత్తగూడెం సమీపంలోని త్రీ ఇంక్లైన్ పంచాయతీ ప్రభుత్వ పాఠశాలలో ఎస్పీ రోహిత్‌రాజ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎస్పీతో పాటు డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు కరుణాకర్, రమేష్, శివప్రసాద్ తదితరులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

క్లుప్తంగా

ఓటేయని మున్సిపల్ చైర్మన్

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోలేదు. ఆయన గత 12 రోజులుగా హైదరాబాద్‌లోని కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గణేష్ గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ఆ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా డీవీకే అప్పగించడంతో ఆయన ఇల్లెందుకు రాలేకపోయారు.

అనంతారంలో స్వల్ప ఘర్షణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అనంతారం గ్రామంలో సోమవారం కాంగ్రెస్ కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోగా, ఒక వర్గం వారు బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసేలా ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో మరో వర్గం కార్యకర్తలు వారితో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఓ కార్యకర్తపై దాడికి పాల్పడడంతో స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు అప్రమత్తమై ఇరు వర్గాలను అడ్డుకున్నారు. కాగా, ఈ ఘటనపై ఇరు వర్గాల వారు పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేశారు.

ఓటేస్తున్న ఫొటో వాట్సప్‌లో...

బీఆర్‌ఎస్ నేతపై కేసు నమోదు

టేకులపల్లి: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్ సైదా రవూఫ్ తెలిపారు. టేకులపల్లి మండలం ప్రెగళ్లపాడు పంచాయతీ తూర్పుగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, హరిసింగ్‌నాయక్ యువసేన అధ్యక్షుడు జాటోతు నరేష్ సోమవారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ముత్యాలంపాడు కేంద్రంలో ఓటేశాడు. అయితే ఓటు వేస్తూ తీసిన ఫొటో 'ఎమ్మెల్యే ప్రెగళ్లపాడు సైన్యం' అనే వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేశాడు. ఇది వైరల్ కావడంతో రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్ కింద నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓటు వేసేందుకు వెళ్తూ గుండెపోటుతో మృతి


నాగేశ్వరరావు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళ్తూ గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట మండలం వేదాంతపురం గ్రామానికి చెందిన కాశి నాగేశ్వరరావు(58)కు వాగొడ్డుగూడెం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు ఉంది. ఓటు వేసేందుకు బయలుదేరిన నాగేశ్వరరావు ఆటో కోసం స్థానిక ఆలయం వద్ద నిల్చున్నాడు. ఈ క్రమంలో అస్వస్థతకు గురై అక్కడికక్కడే కుప్పకూలి పడిపోగా, గమనించిన స్థానికులు అశ్వారావుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మృతి చెందాడని నిర్ధారించారు.

రూ.5లక్షల నగదు స్వాధీనం

కారేపల్లి: కారేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం ఉదయం చేపట్టిన వాహన తనిఖీల్లో అధికారులు రూ.5లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఆగి ఉన్న కారులో ఎన్నికల స్క్వాడ్ అధికారులు తనిఖీ చేయగా రూ.5 లక్షల నగదు లభించింది. కాగా, ఈ నగదును కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీలకు అందజేయడానికి తీసుకొచ్చినట్లు తెలిసింది.

బీఆర్‌ఎస్ నాయకుల నిర్బంధం

నగదు పంపిణీ విషయమై బీఆర్‌ఎస్‌లో గొడవ జరగగా.. నాయకులను నిర్బంధించిన ఘటన కారేపల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కారేపల్లి మండలంలోని బీఆర్‌ఎస్ బూత్ కమిటీలకు పంపిణీ చేయడానికి జిల్లా పార్టీ నుండి రూ.9 లక్షల పైచిలుకు నగదు పంపించినట్లు సమాచారం. ఇందులో రూ.3లక్షలు మాత్రమే పంపిణీ చేస్తుండగా కార్యకర్తలు నిలదీశారు. ఆపై నాయకులను గదిలో ఉంచి నిర్బంధించడంతో ఉద్రిక్తత నెలకొనగా.. బూత్ కమిటీలకు మొత్తం నగదును పంపిణీ చేయడంతో గొడవ సర్దుమణిగింది.

ఉసురు తీసిన ఈత సరదా

బావిలో మునిగి యువకుడు మృతి

కారేపల్లి: సరదాగా స్నేహితులతో కలిసి బావిలో ఈతకు వెళ్లి యువకుడు నీట మునిగి మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం మాధారంలో సోమవారం చోటుచేసుకుంది. మాధారం గ్రామానికి చెందిన తాటి సంతోష్(25) సోమవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి మాధారం-గోవింద్‌తండా సమీపాన బావిలో ఈతకు వెళ్లాడు. అయితే, బావిలో దూకిన సంతోష్ తిరిగి పైకి రాకపోవడంతో ఆయన స్నేహితులు కేకలు వేయగా సమీపంలోని వారు చేరుకుని సంతోష్‌ను బయటకు తీసుకొచ్చే సరికే ఆయన మృతి చెందాడు. మాధారానికి తాటి కృష్ణ-సుశీల దంపతుల కుమారుడైన సంతోష్ హమాలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుండగా ఆయన మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా రోదించారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.14,229

మేం ఓటు వేసేది లేదు...

- పలుచోట్ల బహిష్కరించిన ప్రజలు
- సమస్యల పరిష్కారంపై హామీ ఇవ్వాలని డిమాండ్
- ప్రజాప్రతినిధులు, అధికారులు నచ్చచెప్పడంతో ఓటింగ్‌కు హాజరు


లక్ష్మీదేవిపల్లి మండలంలోని గొల్లగూడెంలో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కొత్తగూడెంరూరల్: గ్రామంలోని సమస్యలు పరిష్కరించేంతవరకు ఓటు వేయబోమని భద్రాది కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామంలోని గొల్లగూడెం వాసులు నిరసన తెలిపారు. సోమవారం ఉదయం గంట పాటు బైఠాయించిన వారు రహదారులు, డ్రైయినేజీలు, తాగు నీరు వంటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో ఏఎస్పీ విక్రాంత్‌సింగ్, డీఎస్పీ రెహమాన్, ఎస్‌ఐ రమణారెడ్డి గొల్లగూడెం చేరుకున్నారు. సమస్యలన్నీ త్వరలో పరిష్కరిస్తామని చెప్పగా.. వారు ఓటింగ్‌కు బయలుదేరారు. కాగా, గ్రామస్తుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఓటు వేసేలా కృషి చేసిన ఏఎస్పీ, డీఎస్పీ, ఎస్సైని ఎస్పీ రోహిత్‌రాజ్ అభినందించారు.

గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో..

గుండాల: గుండాల మండలం పెద్దతోగు గ్రామంలో 81 మంది ఓటర్లు ఉండగా స్థానిక పోలింగ్ కేంద్రంలో 21 మంది, గుండాల పోలింగ్ కేంద్రంలో 60 మందికి కేటాయించారు. దీంతో ఓటర్లు 16 కి.మీ దూరం వెళ్లాల్సి వస్తోంది. తమకు ముత్తాపురం నుంచి ఆరు కి.మీ. మేర రోడ్డు సౌకర్యం లేదని, గ్రామంలోనే ఓటు వేసే అవకాశం కల్పించాలనే డిమాండ్‌తో రెండు గంటల పాటు రోడ్డుపై ధర్నా చేశారు. దీంతో గుండాల సీఐ రవీందర్, తహసీల్దార్, ఎంపీడీఓ చేరుకుని వారితో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి నిధులు ఉన్నా అటవీశాఖ అనుమతి కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, వచ్చే ఎన్నికల నాటికి అందరూ స్థానికంగా ఓటు వేసేలా అవకాశం కల్పిస్తామని చెప్పడంతో శాంతించిన గ్రామస్తులు గ్రామపంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన వాహనంలో గుండాలకు వెళ్లి ఓటేశారు. ఇక ఆళ్లపల్లి మండలం రాయిగూడెం గ్రామస్తులు సైతం కిన్నెరసానిపై వంతెన, బాటన్ననగర్‌కు రోడ్డు సౌకర్యం కోసం ఎన్నికలను బహిష్కరించగా విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నచ్చచెప్పడంతో వారు ఓటేసేందుకు ముందుకు వచ్చారు. అలాగే, గ్రామాభివృద్ధి కోసం ఎన్నికలు బహిష్కరిస్తూ పెద్ద వెంకటాపురం గ్రామస్తులు తీర్మానం చేయగా వారు సైతం ఎమ్మెల్యే హామీతో ఓటు వేశారు.


పెద్దతోగు గ్రామంలో బైఠాయించిన గ్రామస్తులు

కొమ్ముగూడెం తండా వాసుల నిరసన


కొమ్ముగూడెం ప్రజలకు నచ్చచెబుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: గ్రామంలో సాగునీటి వనరులు లేవంటూ ఇల్లెందు మండలం లచ్చగూడెం గ్రామ పంచాయతీ కొమ్ముగూడెం తండా వాసులు లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించారు. గ్రామంలో 371 మందిలో 50 మంది ఓటు వేశాక.. రైతులు తమకు అన్యాయం జరుగుతోందంటూ ఎన్నికల బహిష్కరణపై ప్రకటన చేశారు. దీంతో ఎమ్మెల్యే కోరం కనకయ్య వెళ్లగా సాగునీటి సౌకర్యం కల్పించాలని, లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మించాలని రైతులు కోరారు. అయితే, లిఫ్ట్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతం ఖమ్మం జిల్లాలోకి వెళ్లినందున అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. అలాగే, గతంలో సింగరేణి నిధులతో ప్రతి గల్లీకి సీసీ రోడ్లు వేయించానని, తాగునీటి పథకం నిర్మించానని చెప్పగా.. తహసీల్దార్ రవికుమార్, సీఐ కరుణాకర్ కూడా చేరుకుని ప్రజలకు నచ్చచెప్పడంతో రైతులు పోలింగ్ కేంద్రానికి బయలుదేరారు.

ఎన్నెస్పీ కాల్వపై వంతెన లేదని..

ఏన్కూరు: ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఎందరు మారినా సమస్య పరిష్కరించడం లేదని ఆగ్రహించిన ఏన్కూరు మండలం రాయమాదారం గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. గ్రామానికి చెందిన రైతుల పొలాలు ఎన్నెస్పీ కాల్వలకు అవతలి వైపు ఉండగా, బ్రిడ్జి లేక రెండు కి.మీ. తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీంతో స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఓటు వేసేది లేదని పేర్కొనగా.. తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు, ఎంపీడీఓ సకినాల రమేష్ చేరుకుని సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని నచ్చచెప్పడంతో వారు ఓటింగ్‌లో పాల్గొన్నారు.

లౌకికవాదమే మన జీవన విధానం

– డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



మధిర: లౌకికవాదం మన జీవన విధానమని, ప్రజాస్వామ్యం మీదే పునాదులు ఆధారపడి ఉన్నందున ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. మధిరలోని సుందరయ్య నగర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆయన ఓటు వేశాక మాట్లాడారు. ప్రజాస్వామ్యయుతంగా నచ్చిన పార్టీకి ఓటేసి నచ్చిన ప్రభుత్వాన్ని తెచ్చుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం ఆయన డలంలోని మునగాల కృష్ణాపురంలో పర్యటించి పోలింగ్ సరళిపై స్థానిక నేతలతో చర్చించారు.

బీజేపీతో రాజ్యాంగం, రిజర్వేషన్లకు ముప్పు

– రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కల్లూరురూరల్: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని సమూలంగా మార్చడమే కాక ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు రద్దు చేస్తుందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తన స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశాక ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను సంరక్షించే బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని తెలిపారు. బీజేపీ లాంటి పార్టీకి రాష్ట్రంలో చోటు ఇవ్వకూడదన్నారు. ఆయన వెంట పొంగులేటి ప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజాహిత పాలనకు ఈ ఎన్నికలు ఊతం

– రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మంవన్‌టౌన్: దేశ భవిష్యత్‌ను నిర్ణయించేవే లోక్‌సభ ఎన్నికలు అని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మంలోని గొల్లగూడెంలో ఓటు హక్కు వినియోగించుకున్నాక మంత్రి మాట్లాడారు. దేశం, తెలంగాణలో ఈ ఎన్నికలు ప్రజాహిత పాలనకు ఊతమిస్తాయని తెలిపారు. ప్రజలు అభిమానించే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పదికాలాల పాటు సమర్థవంతంగా, శక్తిమంతంగా పాలించేలా ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లోనూ తీర్పు ఇస్తారనే నమ్మకం ఉందని తెలిపారు. మంత్రి వెంట నాయకులు సాధు రమేష్‌రెడ్డి, రావూరి సైదుబాబు, రషీద్, బొమ్మిడి శ్రీనివాస్, కమతం రామకృష్ణ, సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ది గోబెల్స్ ప్రచారం

– బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి



కల్లూరురూరల్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని, రిజర్వేషన్లు తొలగిస్తుందని కాంగ్రెస్ మోసపూరిత ప్రచారం చేస్తోందని బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. నారాయణపురంలో ఆయన ఓటు వేశాక మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీయే పలుమార్లు మార్చిందని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా నరేంద్రమోదీ మూడో సారి ప్రధాని పదవి చేపట్టనున్నారని తెలిపారు. కాగా, రాష్ట్రంలో ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ తీరును ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు. ఈ సమావేశంలో పొంగులేటి మహేందర్‌రెడ్డి, నంబూరి రామలింగేశ్వరరావు, బి.పోతురాజు పాల్గొన్నారు.

రెండు స్థానాల్లో గెలుస్తాం...

– రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం మయూరిసెంటర్/తిరుమలాయపాలెం: ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు నామ నాగేశ్వరరావు, మాలోతు కవిత గెలుస్తారని ఎంపీ వద్దిరాజు ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మంలో ఓటు హక్కు వినియోగించుకున్నాక ఆయన మాట్లాడుతూ ఎన్నికల సరళిని పరిశీలిస్తే కేసీఆర్‌కు పట్టం కట్టాలని ప్రజలు నిర్ణయించుకున్నట్లు అర్థమైందని తెలిపారు. కాగా, తిరుమాలయపాలెం మండలం పిండిప్రోలులో ఓటు వేశాక ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి మోసపోయిన ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పనున్నారని.. అసెంబ్లీకి భిన్నంగా తీర్పు ఇవ్వబోతున్నారని తెలిపారు. నాయకులు బెల్లం వేణు పులుగుజ్జు వెంకటేశ్వర్లు చామకూరి రాజు, పరికపల్లి చంద్రశేఖర్, వెంకట్, దూదిమెట్ల శ్రీను, తాత రవీందర్, చామకూరి వెంకన్న పాల్గొన్నారు. కాగా, ఖమ్మంలో ఓటు వేశాక బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల్లో తాను గెలవబోతున్నానని ఓటింగ్ సరళితో అర్థమైందని చెప్పారు.


భద్రాచలంలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య దంపతులు, నాయకులు


ఓటు వేసిన స్వతంత్ర అభ్యర్థి చందా లింగయ్య


జెడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు

ఓటేసిన నేతలు...

సాక్షి ప్రతినిధి, ఖమ్మం :

లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధిరలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఆయన భార్య మల్లు నందిని, కుమారుడు సూర్య విక్రమాదిత్య ఓటు వేశారు. కల్లూరు మండలం నారాయణపురంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన సోదరుడు ప్రసాద్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఖమ్మంలోని గొల్లగూడెంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఓటు వేశారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ఖమ్మంలోని కవిత పీజీ కళాశాలలో, భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం తిమ్మంపేటలో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్‌లోని అంబేద్కర్ కాలేజీ సెంటర్‌లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఆయన కుటుంబ సభ్యులు, తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో ఎమ్మెల్సీ తాతా మధు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక వైరాలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, మధిర మండలం కొస్తాలలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, సత్తుపల్లిలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, భద్రాలలంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, కొత్తగూడెంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, దమ్మపేట మండలం గండుగులపల్లిలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మణుగూరు సమితిసింగారంలో, టేకులపల్లి మండలం కోయగూడెంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఓటు వేశారు. ఇక ఖమ్మం హార్వెస్ట్ పాఠశాలలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దంపతులు, సత్తుపల్లి, కూసుమంచి మండలం రాజుపేటలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య దంపతులు, కందాల ఉపేందర్‌రెడ్డి దంపతులు ఓటు వేశారు. కాగా, కల్లూరు మండలం నారాయణపురంలో బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు.


కల్లూరు మండలం నారాయణపురంలో ఓటేసిన బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి


పాత పాల్వంచలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే వనమా దంపతులు, నాయకులు


టేకులపల్లి కాలేజీలో ఓటేసిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియ దంపతులు


దమ్మపేట మండలం మందలపల్లిలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు


కరకగూడెంలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతరావు

50 ఏళ్ల వయస్సులో మొదటిసారి...

ఓటుహక్కు వినియోగించుకున్న ఎన్‌డీ నేత ఆవునూరి మధు


సిరా గుర్తు చూపిస్తున్న ఆవునూరి మధు

ఇల్లెందురూరల్: న్యూడెమోక్రసీ దళ సభ్యుడిగా, కమాండర్‌గా పనిచేసి 35 ఏళ్లపాటు అజ్ఞాత జీవితం గడిపిన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు 50 ఏళ్ల వయస్సులో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్నాడు. ఇల్లెందు మండలం కొమరారంలో సోమవారం ఆయన ఓటు వేశారు. చిన్నతనంలోనే అజ్ఞాత దళ సభ్యుడిగా చేరిన మధు కమాండర్ స్థాయికి ఎదిగాడు. 2000 సంవత్సరంలో మొదటిసారిగా అరెస్ట్ అయిన ఆయన బెయిల్‌పై బయటకు వచ్చినా మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లాడు. తిరిగి 2019లో అరెస్ట్ అయి ఏడాది పాటు జైలు జీవితం అనుభవించాడు. 50ఏళ్ల ప్రాయంలో తొలిసారి ఓటు వేసిన సందర్భంగా ఆయన నిక విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్ విధానం ద్వారా రాజ్యాధికారాన్ని సాధించలేమని భావించే తాము ఎన్నికలను కేవలం ఎత్తుగడగా మాత్రమే ఉపయోగించుకుంటామని తెలిపారు. అందులో భాగంగానే లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ స్థానం నుంచి న్యూడెమోక్రసీ అభ్యర్థిని బరిలో నిలిపామని చెప్పారు.

కాంగ్రెస్ - బీఆర్‌ఎస్ వర్గాల ఘర్షణ

తిరుమలాయపాలెం: మండలంలోని మేడిదపల్లి పోలింగ్ బూత్‌లో తలెత్తిన వివాదం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఇరు వర్గాలు రాళ్లు, కర్రలతో దాడులు చేసుకోవడంతో రెండు వర్గాల్లో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘర్షణ సమాచారం తెలుసుకున్న పోలీసులు చేరుకుని పరిస్థితిని అదుపులోకి కొనుకొచ్చారు. కాగా, ఘటనపై పరస్పరం ఇచ్చిన ఫిర్యాదులతో కేసులు నమోదు చేశారు.

మొరాయించిన ఈవీఎం, వీవీప్యాట్


ఖమ్మంమయూరిసెంటర్: పోలింగ్ స్టేషన్‌లో క్యూలైన్‌లో వేచి ఉన్న ఓటర్లు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని గాంధీనగర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 300 పోలింగ్ బూత్‌లో ఈవీఎం, వీవీప్యాట్ మొరాయించాయి. గంట పాటు అవి పని చేయకపోవడంతో అధికారులు మరో మిషన్‌ను తెప్పించి, ఓటింగ్‌ను ప్రారంభించారు. ఉదయం 8.15 గంటల నుంచి మిషన్ మొరాయించగా, 9.15 గంటలకు సిబ్బంది మరో మిషన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఓటర్లు గంటకు పైగానే క్యూలైన్‌లో ఓటు వేసేందుకు వేచి ఉన్నారు.

ఈవీఎం సీజ్..

కామేపల్లి : ముచ్చర్ల గ్రామంలోని 235 పోలింగ్ బూత్‌లో ఈవీఎం మిషన్‌లోని ఓ బటన్ లోపలికి వెళ్లడంతో ఈవీఎం మరమ్మతులకు గురైంది. దీంతో టెక్నీషియన్ ఈవీఎం మరమ్మతులు చేపట్టినప్పటికీ వినియోగంలోకి రాకపోవడంతో అధికారులు దానిని సీజ్ చేసి మరో ఈవీఎం ఏర్పాటు చేశారు.

అయ్యప్ప ఆలయంలో సహస్ర కలశాభిషేకం


సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తున్న తంత్రులు, అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని శ్రీ శాస్తా దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక తంత్రులు, పూజారులు టీకే దామోదర్, పాకతిల్లం నారాయణన్ నంబూద్రి కలశాభిషేకం నిర్వహించారు. దేవస్థానం అధ్యక్షుడు చిల్లంచర్ల రాధాకృష్ణ, కార్యదర్శి రాయపూడి వెంకటరమణ, కోశాధికారి పసుమర్తి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

పాల్వంచరూరల్ : పశువులను తప్పించబోయి ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం కింద పడిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా, మరో యువకుడు గాయపడిన ఘటన పాల్వంచ మండలం జగన్నాథపురం వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బూర్గంపాడు మండలం వేపలగడ్డకు చెందిన షేక్ సమీర్(22), అతడి మిత్రుడు మడకం సతీష్‌తో కలిసి కొత్తగూడెంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువును చూసేందుకు వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా జగన్నాథపురం శివారులో రహదారిపై పశువులు అడ్డురాగా, వాటిని తప్పించే క్రమంలో బైక్‌పై నుంచి పడిపోయారు. దీంతో తీవ్రంగా గాయపడిన సమీర్ అక్కడికక్కడే మృతిచెందగా, సతీష్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాద స్థలాన్ని ఎస్‌ఐ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గాయపడిన సతీష్‌ను ఆస్పత్రికి తరలించారు.

రెండు బైక్‌లు ఢీ : నలుగురికి గాయాలు


గాయపడిన కాంతారావు

జూలూరుపాడు: మండలంలోని అనంతారం గ్రామంలో రెండు బైక్‌లు ఢీకొని నలుగురు గాయపడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. శంభునిగూడెం గ్రామానికి చెందిన బండ కాంతారావు బైక్‌పై చెల్లె హైమావతి, బావ రాంబాబుతోపాటు చిన్నారి లక్ష్మీపార్వతిని ఎక్కించుకొని పెనుబల్లి మండలం గంగదేవిపాడులో ఓటు వేసేందుకు తీసుకెళ్తున్నాడు. అదే సమయంలో అనంతారం గ్రామానికి చెందిన బచ్చల రామకృష్ణ బైక్‌పై ఎదురుగా వస్తుండగా ప్రమాదవశాత్తు రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కాంతారావుతో పాటు అతడి మేనకోడలు లక్ష్మీపార్వతి తీవ్రంగా గాయపడగా, రాంబాబు, హైమావతికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వృద్ధులకు పాట్లు..


ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాలలో వృద్ధులు ఇబ్బంది పడుతుండగా.. వీల్‌చైర్‌లో కూర్చున్న సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులకు సిబ్బంది తీరుతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఖమ్మం ప్రభుత్వ మహిళా కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద వీల్ చైర్లు ఏర్పాటుచేసినా సిబ్బంది పక్కన పెట్టారు. ఇక ఎస్‌ఆర్ అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో వీల్ చైర్లు సరిపడా లేక దివ్యాంగులు, వృద్ధులు వేచి చూడాల్సి వచ్చింది.

ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం వైఎస్‌ జగన్, భారతమ్మ





పులివెందుల: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఓటుహక్కు వినియోగించుకున్నారు. వైఎస్సార్‌ జిల్లా పులివెందులలోని భాకరాపురంలోని పోలింగ్‌ కేంద్రంలో తన సతీమణి వైఎస్‌ భారతి రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి ఓటు వేశారు. పులివెందులలో కడప ఎంపీ అభ్యర్థి వైఎస్‌ అవినాశ్‌రెడ్డి కూడా ఓటు వేశారు. కడపలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఇడుపులపాయలోని మల్లేలమ్మ తల్లి నగర్‌లో ఏపీ పీసీసీ చీఫ్‌ షర్మిల, అనిల్‌కుమార్‌ ఓటు వేశారు.

ఓటేసి వచ్చేశారు..



చౌటుప్పల్: హైదరాబాద్‌–విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం వాహనాల రద్దీ ఏర్పడింది. ప్రధానంగా హైదరాబాద్‌ మార్గంలో వాహనాలు బారులుదీరి వెళ్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పార్లమెంట్‌తోపాటు అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో నివాసం ఉన్నవారు ఓటు వేసేందుకు సొంతూర్లకు వెళ్లి తిరుగు పయనమవుతున్నారు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ మొదలైంది.

పచ్చ మూకల విధ్వంసకాండ

ఓటమి భయంతో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు, దౌర్జన్యాలు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో ఓటమి భయంతో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు ఫ్యాక్షన్, రౌడీ మూకలతో కలిసి బీభత్సం సృష్టించారు. కర్రలతో దండెత్తారు. కత్తులతో విరుచుకుపడ్డారు. ఏకంగా బాంబు దాడులకు దిగారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సామాన్య ఓటర్లపై యథేచ్ఛగా దాడులకు పాల్పడ్డారు. పోలింగ్‌ ప్రక్రియను అడ్డుకునేందుకు బరితెగించి ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారు. ఇళ్లు, వాహనాలపై దాడులకు తెగబడి విధ్వంస కాండతో చెలరేగిపోయారు. సామాన్య ప్రజానీకాన్ని హడలెత్తించారు. పల్నాడు, అన్నమయ్య, అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం.. ఇలా దాదాపు అన్ని జిల్లాల్లోనూ విధ్వంసానికి దిగారు. ఈ గొడవలన్నింటికీ కర్త, కర్మ, క్రియ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడే. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు టీడీపీ, జనసేన పార్టీలు దాదాపు 15 రోజులుగా రాష్ట్రంలో కుట్రలకు తెరతీసిన విషయం తెలిసిందే. ఓటర్లను యథేచ్ఛగా ప్రలోభాలకు గురి చేయడంతోపాటు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను కవ్విస్తూ దాడులకు పాల్పడుతూ వచ్చాయి. ఆ విధ్వంసకర కుట్రను పోలింగ్‌ సందర్భంగా సోమవారం పతాక స్థాయికి తీసుకువెళ్లాయి. ఉదయం పోలింగ్‌ ప్రారంభమైన కాసేపటికే పోలింగ్‌ సరళి టీడీపీకి వ్యతిరేకంగా ఉందనే విషయం స్పష్టం కావడంతో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌ కల్యాణ్‌ బెంబేలెత్తిపోయారు. దాంతో ముందస్తు పన్నాగంతో సిద్ధం చేసిన తమ రౌడీమూకలకు పచ్చ జెండా ఊపారు. ఆ వెంటనే టీడీపీ, జనసేన రౌడీలు యథేచ్ఛగా దాడులకు తెగబడి రాష్ట్ర వ్యాప్తంగా బీభత్సం సృష్టించారు. ఉదయం మొదలైన ఈ దాడులు, దౌర్జన్య కాండ అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఈ నేపథ్యంలో పోలింగ్‌ ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించేలా చూడాల్సిన ఎన్నికల కమిషన్‌(ఈసీ).. వైఎస్సార్‌సీపీ ఎన్ని ఫిర్యాదులు చేసినప్పటికీ టీడీపీ, జనసేన గుండాల దాడులపట్ల ఉదాసీనంగా ఉండటం విస్మయ పరుస్తోంది.

హడలెత్తిన టీడీపీ, జనసేన

ప్రతిష్టాత్మకమైన ఈ ఎన్నికల్లో పోలింగ్‌ సరళి ఎలా ఉండబోతోందన్న ఉత్కంఠ మొదటి నుంచీ వ్యక్తమైంది. సోమవారం ఉదయం పోలింగ్‌ మొదలు కాగానే రాష్ట్ర వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఓటర్లు పోలింగ్‌ కేంద్రాల వద్ద బారులు తీరారు. వారిలో మహిళలు, వృద్ధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలు అత్యధికంగా ఉండటం విశేషం. ఆ వర్గాలన్నీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల పట్ల సానుకూలంగా ఉన్నారని జాతీయ చానళ్లతోపాటు అన్ని సర్వేలు వెల్లడించాయి. అంటే ఓటింగ్‌ సరళి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉందన్నది స్పష్టమైంది. దాంతో బెంబేలెత్తిన చంద్రబాబు, పవన్‌ కల్యాణ్‌లు.. ఓటింగ్‌ ప్రక్రియను దెబ్బతీసే కుట్రకు తెరతీశారు. పోలింగ్‌ సరళి తమకు అనుకూలంగా లేకపోతే విధ్వంసం సృష్టించేందుకు ముందుగానే ఆ రెండు పార్టీలు పన్నాగం పన్నాయి. అందుకోసం టీడీపీలోని రౌడీ షీటర్లతోపాటు ఇతర ప్రాంతాల నుంచి రౌడీలను ముందుగానే రప్పించాయి. కర్రలు, కత్తులతోపాటు పెట్రోల్‌ బాంబులు కూడా ముందుగానే సమకూర్చుకోవడం టీడీపీ, జనసేన కుట్రకు నిదర్శనం. చంద్రబాబు ఆదేశించగానే.. టీడీపీ, జనసేన రౌడీలు రాష్ట్ర వ్యాప్తంగా దాడులకు తెగబడ్డారు.

చోద్యం చూసిన ఈసీ

టీడీపీ, జనసేన గూండాలు బరితెగించి విధ్వంసానికి పాల్పడి పోలింగ్‌కు ఆటంకాలు సృష్టించినా ఎన్నికల కమిషన్‌(ఈసీ) నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం నివ్వెర పరుస్తోంది. వారం రోజుల ముందు నుంచే టీడీపీ ఎన్నికల ప్రలోభాలపై వైఎస్సార్‌సీపీ ఈసీకి ఫిర్యాదు చేసింది. ప్రధానంగా వుయ్‌ యాప్‌ పేరుతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తుండటంపై పూర్తి ఆధారాలను కూడా సమర్పించింది. టీడీపీ గూండాలు దాడులకు పాల్పడిన ఉదంతాలను.. పోలింగ్‌ రోజున విధ్వంసం సృష్టించేందుకు పదును పెడుతున్న కుట్రలను కూడా ఈసీ దృష్టికి తీసుకువెళ్లింది. అయినా సరే పోలింగ్‌ ప్రశాంతంగా, సక్రమంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవడంలో ఈసీ పూర్తిగా విఫలమైంది. అసలు టీడీపీ, జనసేన గూండాలు వీధుల్లోకి వచ్చి చెలరేగిపోతున్నా.. పోలింగ్‌ కేంద్రాల్లో ప్రవేశించి బెదిరింపులకు పాల్పడుతున్నా.. ఈవీఎంలను ధ్వంసం చేసినా.. ఏకంగా బాంబు దాడులకు పాల్పడినా సరే ఈసీ మాత్రం క్రియాశీలంగా స్పందించనే లేదు. పైగా వైఎస్సార్‌సీపీ నేతలనే కట్టడి చేసేందుకు యత్నించడం విభ్రాంతి కలిగిస్తోంది.



పల్నాడు జిల్లా నరసరావుపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి ఇంటి ముందు ఉన్న కార్లపై కర్రలు, రాళ్లతో దాడిచేస్తున్న టీడీపీ గూండాలు

గుంటూరు జిల్లా తెనాలిలో పోలింగ్‌ బూత్‌లో ఓటు వేసేందుకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అన్నాబత్తున శివకుమార్‌ను టీడీపీ కార్యకర్త గొట్టిముక్కల సుధాకర్‌ పరుష పదజాలంతో దూషించారు. మాల, మాదిగలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ నోరు పారేసుకున్నారు.

దీనిపై ఎమ్మెల్యే అన్నాబత్తున శివ కుమార్‌ అభ్యంతరం చెప్పినా వినిపించుకోకుండా మరింతగా దూషించడంతో ఇరువురి మధ్య ఘర్షణ తలెత్తింది. పోలీసులు ఇద్దరికీ సర్దిచెప్పి పంపించి వేశారు. ఈసీ మాత్రం ఎమ్మెల్యే అన్నా బత్తున శివ కుమార్‌ను పోలింగ్‌ ముగిసే వరకు గృహ నిర్బంధంలో ఉంచాలని పోలీసులను ఏకపక్షంగా ఆదేశించడం విస్మయ పరిచింది. ఆయన్ను దూషించిన టీడీపీ కార్యకర్తపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. పల్నాడు జిల్లా నరసారావుపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నివాసంపై టీడీపీ రౌడీలు దాడికి పాల్పడి, అక్కడ ఉన్న వాహనాలను ధ్వంసం చేశాయి. కానీ ఈసీ మాత్రం ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచమని పోలీసులను ఆదేశించడం విడ్డూరంగా ఉంది.

కత్తిపోటు నుంచి బాంబు దాడుల వరకూ..

పోలింగ్‌ మొదలైన కాసేపటికే టీడీపీ రౌడీలు చిత్తూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌పై కత్తితో దాడి చేశారు. అనంతరం పోలింగ్‌ శాతం పెరుగుతున్న కొద్దీ రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, జనసేన దాడుల తీవ్రతను అమాంతం పెంచుకుంటూ పోయాయి.

బాపట్ల జిల్లా చీరాలలో కాంగ్రెస్‌ అభ్యర్థిగా ఉన్నప్పటికీ ఆమంచి శ్రీనివాస్.. టీడీపీ అభ్యర్థి ఎం.ఎం.కొండయ్య యాదవ్‌కు అనుకూలంగా పని చేశారు. పోలింగ్‌ సరళి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండటంతో ఆయన తీవ్ర అసహనానికి గురైన ఆయన రెడ్డిపాలెం పోలింగ్‌ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ నేత అంకమ్మగారుపై దాడి చేసి చెంపపై దాడి చేశారు. టీడీపీ అభ్యర్థి ఎం.ఎం. కొండయ్య యాదవ్‌ తన అనుచరులతో వైఎస్సార్‌సీపీ నేత, రాష్ట్ర అర్బన్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ గవిని శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డారు.

వైఎస్సార్‌ జిల్లా జమ్మలమడుగులో టీడీపీ అభ్యర్థి ఆదినారాయణ రెడ్డి, ఆయన వర్గీయులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌ రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. రాళ్లు, ఇటుకలతో దాడి చేయడంతో సుధీర్‌రెడ్డికి గాయమైంది. ఎర్రగుంట్ల 14వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి షాహీద్‌పై టీడీపీ నేతలు దాడి చేశారు.

వీరపునాయునిపల్లె మండలంలోని యు.వెంకటాపురం, బుసిరెడ్డిపల్లె గ్రామాల్లో టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడికి పాల్పడ్డారు. కడపలో ఓట్లు వేసేందుకు క్యూలో ఉన్న ముస్లింలపై టీడీపీ గూండాలు రాళ్ల దాడికి తెగబడ్డాయి. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లి మండలం చౌటపల్లె పోలింగ్‌ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ వర్గీయులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో అక్కడకు చేరుకుని ఉద్రిక్తతలను మరింతగా రెచ్చగొట్టడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.



బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా పల్లంలో టీడీపీ దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ సాను భూతిపరుడు

రాయచోటి నియోజకవర్గంలోని నక్కవాండ్లపల్లి 175 పోలింగ్‌ కేంద్రంలో టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడటంతో వైఎస్సార్‌సీపీ నేత తిరుపాల్‌ నాయుడు తీవ్రంగా గాయపడ్డారు. దప్పేపల్లి గ్రామం మేడిమాకల గుంతరెడ్డివారిపల్లె పోలింగ్‌ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ పోలింగ్‌ ఏజెంట్లపై టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండలం చౌటపల్లె పోలింగ్‌ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ వర్గీయులు రాళ్లతో దాడి చేశారు. ఇదే సమయంలో రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న అడిషనల్‌ ఎస్పీ హైమావతి, డీఎస్పీ శ్రీధర్, స్పెషల్‌ పార్టీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

రాయచోటి నియోజకవర్గంలోని నక్కవాండ్లపల్లి 175 పోలింగ్‌ కేంద్రంలో టీడీపీ వర్గీయుల దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుపాల్‌ నాయుడు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రవీంద్రనాథ్‌ ఠాగూర్‌ ప్రైమరీ స్కూల్‌ వద్ద టీడీపీ నాయకులు కండువా, పసుపు చొక్కాలు ధరించి టీడీపీకి ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. దీన్ని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు.

మచ్చుకత్తితో దాడి

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం ఓడీ చెరువు మండలం కుసుమవారిపల్లిలో స్లిప్పుల పంపిణీ కోసం టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన శిబిరం వద్దకు వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ శిబిరం వద్దకు ఓటర్లు వెళ్లడంతో ఓర్చుకోలేని టీడీపీ కార్యకర్త ఇడగొట్టు రంగప్ప మచ్చుకత్తితో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంద్రప్పను పొడిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై పేగులు బయటకు వచ్చాయి. ఈ సంఘటనతో భయభ్రాంతులకు గురైన ఓటర్లు చెల్లాచెదురయ్యారు. హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం హుస్సేన్‌పురంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతలు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గ్రామంలో పోలింగ్‌ సరళిని పరిశీలించి తిరిగి వెళ్తున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాళ్లు రువ్వారు. ఘటనలో పురుషోత్తం రెడ్డి ప్రయాణిస్తున్న కారు ధ్వంసమైంది. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త నవీన్‌ తలకు తీవ్ర గాయాలయ్యాయి.

ఒప్పిచర్లలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌లపై హత్యాయత్నం

పల్నాడు జిల్లా కారెంపూడి మండలం ఒప్పిచర్ల పోలింగ్‌ కేంద్రంలో ఎన్నికల రిలీవ్‌ ఏజెంట్‌గా ఉన్న వైఎస్సార్‌సీపీ నేత పాలకీర్తి నరేంద్ర, అతడి తమ్ముడిపై టీడీపీ మూకలు మూకుమ్మడిగా దాడి చేశారు. ప్రాణ భయంతో వారు తప్పించుకుని బయటకు పరుగులు తీశారు. దాదాపు 300 మంది టీడీపీ గూండాలు వెంటపడటంతో కారెంపూడి పోలీస్‌ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ ఘటన అనంతరం పొట్టి శ్రీరాములు కాలనీలోని ఎన్నికల బూత్‌ల వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు దిగి రాళ్ల దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇరికెదిండ్ల లాజర్‌తో పాటు పలువురికి గాయాలయ్యాయి. కారెంపూడిలోని 288 నెంబర్‌ బూత్‌లో ఎన్నికల ఏజెంట్‌గా ఉన్న గోగుల సాంబశివరావు తమ్ముడిపై టీడీపీ వర్గీయులు దౌర్జన్యానికి పాల్పడడంతో దాడిని అడ్డుకునే యత్నంలో సాంబశివరావు తలకు గాయమైంది. వైఎస్సార్‌ జిల్లా వేముల మండలం ముబ్బుచింతలపల్లె పోలింగ్‌ కేంద్రం వద్ద వైఎస్సార్సీపీ వర్గీయులపై టీడీపీ వర్గీయులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. టీడీపీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న నూలి భాస్కర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అడ్డుకోవడంతో టీడీపీ వర్గీయులు పథకం ప్రకారం రాళ్ల దాడి చేశారు. కాగా, టీడీపీ వర్గీయుల రాళ్ల దాడిలో జల్లా సునంద అనే మహిళకు చేయి విరిగింది. మరో వ్యక్తికి గాయాలయ్యాయి.

పూతలపట్టులో తెలుగు తమ్ముళ్ల వీరంగం

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని మూడు పోలింగ్‌ బూత్‌లతో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై పచ్చ మూక దాడులకు పాల్పడింది. పేటగ్రహారానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రవినాయుడు పోలింగ్‌ బూత్‌లోకి వెళ్లే సమయంలో టీడీపీ నాయకులు కర్రలతో దాడి చేశారు. అనంతరం పేటపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గురుస్వామినాయుడుపై దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో గురుస్వామి నాయుడు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వావిల్‌తోట పంచాయతీ సీఎం కండ్రిగ పోలింగ్‌ బూత్‌లో ఏజెంట్‌గా వున్న హరిబాబుపై టీడీపీ నాయకులు దాడి చేశారు. ఈ దాడిలో అతనికి తీవ్ర గాయాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదే జిల్లా సోమల మండలం కందూరు పోలింగ్‌ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు సురేష్‌రెడ్డిపై టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు దాడికి పాల్పడ్డాడు. పోలింగ్‌ కేంద్రంలో వద్ద ఏర్పడిన వివాదంతో సుబ్రమణ్యం నాయుడు తన అనుచరులతో కలసి దాడి చేశాడు. గంగాధర్‌ నెల్లూరు మండలం జంగాలపల్లి పోలింగ్‌ బూత్‌ వద్ద టీడీపీ నాయకులు గ్రామస్తులపై దౌర్జన్యం చేశారు. చిత్తూరు మండలం పెరుమాళ్ళ కండ్రిగలో టీడీపీ నాయకులు రెచ్చిపోయి వైఎస్సార్సీపీ నాయకుడి ఇంటిపై దాడి చేశారు. కారును ధ్వంసం చేసి ఓ నాయకుడిని తీవ్రంగా గాయపరిచారు. తౌలుత టీడీపీ నాయకులు ఓటర్లను ఇబ్బందులకు గురిచేస్తూ రోడ్డుకు అడ్డంగా పందిరి వేశారు. దీనిని పోలీసులు తీసి వేయడంతో జీర్ణించుకోలేక వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై దౌర్జన్యానికి దిగారు. ఇనుప రాడ్లు, కొయ్యలతో పలువురిని తీవ్రంగా గాయపరిచారు.

పసుపు కండువాతో 'గంటా' హల్‌చల్

భీమిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు పసుపు కండువాతో హల్‌చల్‌ చేశారు. తన అనుచరులతో కలిసి పోలింగ్‌ స్టేషన్‌లోకి వెళుతుండగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోకర్నపల్లి పోలింగ్‌ బూత్‌లో ఏజెంట్ల మధ్య తలెత్తిన వివాదం టీడీపీ, వైఎస్సార్‌సీపీల మధ్య కొట్లాటకు దారితీసింది. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతాడ జీవరత్నం, యతేంద్ర, సంపతిరావు సూర్యనారాయణలకు తీవ్ర గాయాలయ్యాయి. డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం గ్రామంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌ కుమార్‌ పోలింగ్‌ బూత్‌ వద్దకు వెళ్లడంతో టీడీపీ నాయకులు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీకి చెందిన మల్లాడి చిన ధర్మారావు, మల్లాడి నర్సింహులు, అరదాని శ్రీను తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై టీడీపీ నేతలు దాడులు చేశారు. రామకృష్ణారావుపేటలో కొందరు టీడీపీ సానుభూతిపరులు చేసిన దాడిలో మాజీ కార్పొరేటర్‌ రోకళ్ళ సత్యనారాయణతో పాటు మరికొందరు గాయపడ్డారు. రూరల్‌ కరప మండలం పెదకొత్తూరులో పోలింగ్‌ బూత్‌ వద్ద జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌ సీపీకి చెందిన చింతా సత్యనారాయణపై దాడి చేసి మొబైల్‌ ఫోన్‌ లాక్కొని వివాదం సృష్టించారు. పిఠాపురం నియోజకవర్గం విరవ, విరవాడ ప్రాంతాల్లో కూడా జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. జగ్గంపేట నియోజకవర్గ పరిధిలో గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామంలో టీడీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఘర్షణకు దిగారు.

'చింతమనేని' వర్గీయులు కత్తెరతో దాడి

పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో వైఎస్సార్‌సీపీకి చెందిన చలపాటి రవిపై చింతమనేని అనుచరులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. పోలింగ్‌ బూత్‌లో ఓటు వేయడానికి వచ్చిన రవి భుజంపై కత్తెరతో పొడవడంతో తీవ్రంగా గాయపడిన రవి ఆసుపత్రిలో విషమ పరిస్థితుల్లో ఉన్నాడు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఆసుపత్రికి చేరుకుని రవిని పరామర్శించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని లాలాపేట ప్రభుత్వ బాలికల హైస్కూలులో పోలింగ్‌ సరళిని పరిశీలించేందుకు వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్‌ నూరి ఫాతిమా, ఎమ్మెల్యే మొహమ్మద్‌ ముస్తఫా వచ్చారు. అప్పుడే అక్కడికి చేరుకున్న టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడి గొడవ పెట్టుకునేందుకు ప్రయత్నం చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలపై లాఠీఛార్జి చేశారు. పొన్నూరు రోడ్డులోని అంజుమన్‌ పాఠశాల బూత్‌లో డీఎస్పీ మల్లికార్జునరావు వైఎస్సార్‌ సీపీకి చెందిన బూత్‌ ఏజెంట్లను ఇబ్బందులకు గురిచేశారు. వారి గుర్తింపు కార్డులను లాక్కొని బయటకు వెళ్లాలంటూ ఆదేశించారని బూత్‌ ఏజెంట్లు ఆరోపించారు.



ఓటేసిన చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి

ఫ్యాన్‌ సునామీ

▶ మొదటి పేజీ తరువాయి

పోలింగ్‌ కొనసాగింది. రాత్రి 10 గంటల సమయానికి 76.50 శాతం పోలింగ్‌ నమోదైనట్లు ఈసీ వర్గాలు వెల్లడించాయి. నగర, పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక శాతం పోలింగ్‌ నమోదైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఎండల ప్రభావం తగ్గడం కూడా పోలింగ్‌ శాతం పెరగడానికి దోహదం చేసింది.

నిర్దేశించేది మహిళలు, గ్రామీణ ఓటర్లే..

పోలింగ్‌ సరళిపై ఇండియాటుడే ఛానల్‌ కన్సల్టింగ్‌ ఎడిటర్‌ రాజ్‌దీప్‌ సర్దేశాయ్‌ సోమవారం రాత్రి టీవీలో చర్చ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో తాను విస్తారంగా పర్యటించానని.. మహిళలు, గ్రామీణ ప్రాంత ఓటర్లు ఎన్నికల ఫలితాలను నిర్దేశిస్తారని రాజ్‌దీప్‌ సర్దేశాయ్‌ పేర్కొన్నారు. ఈ చర్చలో పాల్గొన్న సెఫాలజిస్ట్, ఎగ్జిట్‌ పోల్స్‌ నిర్వహించే యాక్సిస్‌ మై ఇండియా సీఎండీ ప్రదీప్‌ గుప్తా దీనిపై ఏకీభవించారు. ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికల ఫలితాలను మహిళలు, గ్రామీణ ప్రాంత ఓటర్లే నిర్ణయిస్తారని చెప్పారు. రోడ్లు గురించి కాకుండా ప్రభుత్వ సేవలు ఎలా ఉన్నాయన్నదే ప్రామాణికంగా తీసుకుని 80 శాతం మంది మహిళలు ఓటు వేస్తారని తెలిపారు.

ఇంటింటి అభివృద్ధిని ప్రతిబింబించిన పోలింగ్‌ సరళి..

నవరత్నాల పథకాలను గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వం అందిస్తోంది. రాష్ట్రంలో పోలింగ్‌ సరళిని పరిశీలిస్తే మహిళలు, గ్రామీణ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సంక్షేమాభివృద్ధి పథకాలు, విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలలో విప్లవాత్మక సంస్కరణలు, సుపరిపాలనతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదలు సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. ఇంటింటి అభివృద్ధి మరింతగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఓట్లు వేసేందుకు స్వచ్ఛందంగా వచ్చారు. ప్రభుత్వ సానుకూలత సునామీలా ఓటెత్తిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ ఎన్నికలను పెత్తందారులు – పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంగా బడుగు, బలహీన వర్గాలు భావించడం వల్లే భారీగా పోలింగ్‌ నమోదైందని పేర్కొంటున్నారు.

మరిన్ని వివరాలు, వార్తల కోసం ఈ క్యూఆర్‌కోడ్‌ను స్కాన్‌ చేయండి

జిల్లా వార్తలు

ఓటేసిన ప్రముఖులు

పార్లమెంట్‌ ఎన్నికల సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, బరిలో ఉన్న అభ్యర్థులతో పాటు పలువురు ప్రముఖులు తమ గ్రామాలు, పట్టణాల్లో ఓటు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటు వజ్రాయుధమని, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. – నెట్‌వర్క్‌



■ నారాయణపురంలో ఓటు వేసిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన సోదరుడు ప్రసాద్‌రెడ్డి



■ ఖమ్మం కేఎండీసీలో ఓటు వేశాక బీఆర్‌ఎస్‌ అభ్యర్థి నామ నాగేశ్వరరావు



■ మహబూబాబాద్‌ జిల్లా మాధవాపురంలో ఓటు వేసిన కాంగ్రెస్‌ అభ్యర్థి రఘురాంరెడ్డి



■ మణుగూరు సమితిసింగారంలో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు



■ ఖమ్మం గొల్లగూడెంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వేలికి సిరాచుక్క వేస్తున్న ఉద్యోగి



■ ములకలపల్లి మండలం తిమ్మంపేటలో ఓటు వేశాక కుటుంబీకులు, నాయకులతో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు



■ ఖమ్మం అంబేడ్కర్‌ గురుకులంలో ఓటు వేసిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



■ వైరాలోని పోలింగ్‌ కేంద్రం వద్ద ఎమ్మెల్యే రాందాస్‌ నాయక్, ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు



■ దమ్మపేట మండలం గండుగులపల్లిలో ఓటు వేసిన ఎమ్మెల్యే ఆదినారాయణ దంపతులు



■ మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి



■ భద్రాచలంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు దంపతులు



■ ఖమ్మం రూరల్‌ మండలం తెల్దారుపల్లిలో ఓటు వేసి సిరా గుర్తు చూపుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



■ కొత్తగూడెం సింగరేణి స్కూల్‌లో ఓటు వేసిన బీఎస్పీ అభ్యర్థి యెర్రా కామేష్‌ దంపతులు



■ తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



■ సత్తుపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే రాగమయి, కుటుంబ సభ్యులు



■ కొత్తగూడెం మాస్టర్‌ ఈకే విద్యాలయంలో ఓటేసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



■ టేకులపల్లి మండలం కోయగూడెంలో ఓటు వేశాక కుటుంబీకులతో ఎమ్మెల్యే కోరం కనకయ్య